**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహరాజ్‌కీ జై!!**

**సద్గురు శ్రీ సాయినాధుని శరద్బాబూజీకీ జై!!**


# గురుకృప

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నా హృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

## సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నాఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

--- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! — శ్రీ బాబూజీ
2. ఉన్నమాట - అనుకున్నమాట — గురుబంధువులు
3. సన్నిధి చూపి - పెన్నిధి నిచ్చారు — శారద
4. ఆర్తికి - ఆదర్శ, భక్తితో సమర్పణ — ప్రసాద్
5. గురువుగారే మా ఇంటి ఇలవేల్పు — వై. సునీతా రెడ్డి
6. స్థాన వ్యత్యాసాలు గురువుకుండవు — హేమలత
7. అడిగింది ఇచ్చుటే సాయి శపథం — వై. జయశ్రీ
8. కంటిని కాపాడు రెప్పలా! తండ్రిలా బిడ్డను రక్షించు గురునిలా — వి. మణిమాల
9. ఆ క్షణాన ఆ రెండక్షరాలే మృత్యుంజయ మంత్రమై రక్షించే — గట్టా రత్తయ్య
10. ఆ చేయి ఎంత హాయి...భాగం-15 — డా॥ ఎస్. సాయి వరప్రసాదరావు
11. మహనీయుల - మహితోక్తులు — గురుచరణదాసుడు

# ఉన్నమాట - అనుకున్నమాట

## జన్మదిన సంచిక

హే! జగత్పావనా! సద్గురురాయా! మా హృదయ మందిరాలలో సదావశించు. హే జగత్కళ్యాణ కారణా! మా అందరికి సత్కార్యాలు చేయాలనే సద్బుద్ధిని ప్రసాదించు. హే! గురుసేవా పరాయణ! నీ వలె మేము గురుసేవ చేయాలని, గురు కీర్తిని గానం చేయాలని, గురు లీలలను వ్రాయాలనే మా తలంపులకు మీ అనుగ్రహమనే చేయూతనందిమ్ము. గురు చరిత్ర వ్రాయాలనే తహ తహ చెందు వారికి గురుబంధువుల సహాయ సంపత్తి అందేలా! అనుగ్రహించు. ఇలా 'గురుకృప' ప్రార్థిస్తున్నది.

మీ ఆశీర్వచనం, మీ అనుగ్రహంతో 'గురుకృప' త్రైమాసిక పత్రికగా ఆవిర్భవించి నాలుగు వసంతాలు నవ్వుతూ హాయిగా, ఆనందంగా గడిపింది. ఇప్పటి వరకు బాల్యదశలో ఉన్న 'గురుకృప' పత్రిక పాఠశాల స్థాయిలోకి చేరబోతున్నది. ఇప్పుడిప్పుడే అక్షరాభ్యాసం ఆరంభం కానున్నది. మా అందరికి చక్కని పదాలతో కూడిన వాక్య నిర్మాణం అలవడేలా, మంచి వ్యాసకర్తలుగా తర్ఫీదునీయగలరు.

ఇంతకు ముందెలా ఉన్నా, అప్పటి తప్పటడుగుల బిడ్డను చూచిన తండ్రికి నవ్వుతో పాటు, ఆనందించిన రీతి పత్రిక పరిస్థితి. ఇక ముందు అలాకాదుగా. మనందరిపైన బాధ్యత ఉంది. మన 'గురుకృప' పత్రికను గురనుగ్రహానికి, గురుదేవుని ఆనందానికి ప్రతీకగా నడుపుకుందాము. పత్రికా నిర్వహణములోను, గురుచరిత్రను, లీలలను వ్రాతరూపమున అందించటములోను 'ముక్తి' ఉన్నది. 'మోక్ష'మున్నది. 'కోర్కె'లీడేరుటకు అవకాశమున్నది. 'శ్రీకైవల్య పదంబు చేరుటకై...' అంటూ మహాకవి - భక్త పోతన భాగవతారంభంలో చెప్పిన విషయమే మనకు ఆదర్శం, ఆచరణీయం. అందుకనే ఈ జన్మదిన సంచికలో తమ తమ అనుభవాలను వివిధతీరుల్లోను, పలుకోణాల్లోను వ్రాసుకోవాలనుకునే గురుబంధువులకు 'ఆలోచన - అవలోకన' అన్న శీర్షికలో మీమీ అనుభవాలతో పాటు- పత్రిక నిర్వహణకు మీ సూచనలు తెలియజేయవచ్చు. ఇందులో భాగంగానే 'బాబా సూక్తి' నొకదాన్ని ముందుగా తెలియజేసి, దానిపై మీమీ భావాలను (మీ సహజమైన శైలిలో) ఆహ్వానిస్తోంది గురుకృప. ఈ సారి **"నా దగ్గరకు వచ్చిన కుండలన్నీ బోర్లించిన కుండలే"** అన్న వాక్యాన్నిచ్చాము. మీ భావ ప్రకటనను వ్రాతరూపంగా మా కార్యాలయాలకు పంపగలరు. తగినంత ప్రోత్సాహాన్ని చేయూత నీయవలసినదిగా ప్రార్థించుచున్నాము. 'గురుకృప' నిర్వహణన్నది గురుబంధువులదేనన్న విషయం మరువరాదు. 'గురుకృప' ప్రారంభసంచిక నుండి నేటి దాక నాల్గుసంవత్సరాల కాలం పాటు ఉచితంగా అందివ్వటమన్నది గురుదేవుల అనుగ్రహ విశేషమే. ఇక నుంచి సత్సంగ కేంద్ర నిర్వాహకులు తమ సత్సంగ కేంద్రానికి కావలసిన పత్రికలను ముందుగా తెలియజేసినచో, అన్ని కాపీలను ఆయా సత్సంగ కేంద్రాలకు పంపగలము. అక్కడి సత్సంగాలవారికి, అడిగిన వారికి ఉచితంగా ఆయా సత్సంగ కేంద్ర నిర్వహకులు అందివ్వగలరు. సహకరించి చేదోడు వాదోడుగా, అండగా నుండగలరని కోరుచున్నాము.


9-12-2001 తిరుపతికి గురుదేవులు వచ్చినారన్న విషయం 'గురుకృపకు' ఎంతో ఆనందదాయకమైన విషయం. వేలాది మంది వ్యక్తులు విగ్రహప్రతిష్టానంతరం గురుదేవులను దర్శించి అనిర్వచనీయమైన ఆనందాన్ని

అనుభవించినట్లుగాను, ఆదర్శనంలో తెలియని వింత అనుభూతి, దివ్యమైన సౌందర్యారాధన, ఏ విధమైన ప్రమేయము లేకుండానే భక్తి తత్పరతనేమైకం, మత్తు వారిని ఆశ్రయించినట్లుగా మా విలేఖరులు, గురుబంధువులు చెప్పియున్నారు. ఈ సందర్భంగా కొందరి అభిప్రాయాలను మా విలేఖరి సేకరించుయున్నాడు. సమ్మోహము, సంమోహమనే ఒకే సమ్మోహనాస్త్రము రెండుగా - ఆ రూపాన్ని చూచి మారిపోయి ఉంటుందనినారు. స్టేజి మీదకు గురువుగారు వచ్చిన తరువాత వాతావరణంలో వింత మార్పు. భక్తి భావతత్పరత గమనించదగిన అంశాలు. 'అమ్మో'! ఈ నెవరో సామాన్యుడుకాడండి. అదేం రూపం. అదేం మహిమో! వారేవా! ఇది నా జీవితంలో మొదటి మధురానుభూతి. ఇలాంటి వాస్తవాలు వెల్లువలా ప్రవహించాయి. వేలాది మందిని తరింపచేసిన *ఆదివ్యసుందర మహోన్నత మానవాతీత దైవాంశసంభూతునికి, తేజోరాశికి, మహర్షికి, తపస్సంపన్నునికి* కైమోడ్పులర్పించుకుందాము. 'గురుకృప' ద్వారా ఇలాంటి వెన్నో తెలుసుకుందాము. నూతన సంవత్సర శుభారంభ సమయంలో గురుదేవుల అనుగ్రహంతో మనలోని అహంకారపు పొరలు తొలిగించుకొంటూ గురువనే గుబుతును ఎబుకలో ఉంచుకొందాము.

-గురు బంధువులు

## అడిగి... అడిగడిగి... అడుగడుగుకు ఆదరించారు.. ఆదుకున్నారు

## సన్నిధి చూపి - పెన్నిధినిచ్చారు



బాబూజీ.. అంతులేని ఆనందం ఆయన సన్నిధి. ఆయన సన్నిధి మనల్ని ఇతర ఆలోచనలు లేకుండా ఎక్కడికో తీస్కెళ్తుంది. ప్రతి ఒక్కరికి నీకు నేనున్నాను, నా చూపు నీ పైనే సుమా! అన్నట్లుగా అనుభవమిస్తారు. ఆయన స్టేజి మీదకి వచ్చాక (కూర్చున్నాక) ప్రతి ఒక్కరూ ఆయన చూపు తమ వైపు మాత్రమే ఉందంటారు. అక్కడ కూర్చున్న ప్రతి ఒక్కరి అనుభవం ఇది. ఇదెలా సాధ్యం.. ఏమో ఆయనకే ఎబుక.


ప్రతి ఒక్కరికి వారి సమస్యలు తీరుస్తూ, వారికి ఒక గమ్యాన్ని ఏర్పరుస్తూ, వారికి సేదదీర్చుతూ, తన దగ్గరకు చేర్చుకోవడమే ఆయన జీవితలక్ష్యమా అన్నట్లుంటారు. బాబా చరిత్ర చదువుతూ 'అయ్యో మనం బాబా ఉన్న రోజుల్లో లేమే, ఆయన ప్రత్యక్ష సన్నిధి మనకు లభించలేదే' అని అనుకుంటున్న వారికి సమాధానం -- బాబూజీ సన్నిధి.

అటువంటి బాబూజీని మొదట్లో గ్రహించలేక, వ్యక్తిని (అప్పుడు ఆయన్ను వ్యక్తిగానే భావించాను) పూజించడమేంటనే కుసంస్కారంతో 2 సంవత్సరములు గడిపాను. కాని, ఇప్పుడు ఆలోచిస్తూంటే ఆ టైంమ్‌లో కూడా నన్ను తన దగ్గరకు రప్పించుకోవడం కోసం ఆయన ఏయే మిషల్ని నాకు ఎరవేసారో అర్థమవుతోంది. ("నా భక్తుని నాదగ్గరకు రకరకాల మిషల మీద నేనే రప్పించుకొంటాను"- బాబా).

చిట్టచివరకి ఒక బ్రహ్మాస్త్రం ప్రయోగించారు. అప్పటికిగాని నేను కోల్పోతున్నదేంటో నా కర్థం కాలేదు. ఆ బ్రహ్మాస్త్రం ఏంటంటే గురువుగారు వైజాగ్ వచ్చి (19 జనవరి,2000) అందరికీ దర్శనం ఇచ్చారు. నాకు తప్ప అంతేకాకుండా నన్ను కొన్నాళ్ళు సత్సంగానికి కూడా దూరం చేశారు. అలా నాలో అశాంతిని రేకెత్తించారు. ఇది

తట్టుకోలేక, గురువుగారు ఎందుకిలా చేసారు? అని ఏడుస్తూ ఒక లెటర్ వ్రాసాను. ఆ లెటర్‌లో, ఎందుకింత చులకనయ్యాను మీకు? ఒక వేళ నేను మిమ్మల్ని తెలుసుకోలేకపోతే, మీరే నాకు తెలిసివచ్చేట్లు చెయ్యొచ్చు కదా? అని వ్రాసాను. కానీ, నాకేం తెలుసు, ఇదంతా అందులోని భాగమేనని దానితో మనసు కొంచెం శాంతించింది. నేను ఇంకొన్ని లెటర్స్ వ్రాసుకోవడం, అవి గురువుగారు తీర్చడం జరిగినవి.

కష్టం వచ్చిన ప్రతిసారీ ఆయన కన్నతల్లిలా ఆదుకొంటూనే ఉన్నారు. ఎప్పుడైనా సరే, దేవా నేను కష్టంలో ఉన్నాను, నన్ను ఆదుకోవా! అంటే, తక్షణమే ఆయన ఆదుకొంటున్నారు, తీరుస్తున్నారు. ఇది అడుగడుక్కీ జరుగుతోంది. నాకు ఏ సమస్య వచ్చినా గురువుగారికి వ్రాసుకొనేదాన్ని. అన్నింటినీ ఆయన పరిష్కరించారు. మా బ్రదర్ జాబ్ విషయంలో కూడా, నీకు నేనున్నానంటు అతనికి ఎక్కడ జాబ్ కావాలంటే అక్కడ ఇప్పించారు గురువుగారు. మొదట మద్రాసులో జాబ్ ఇప్పించారు. తర్వాత వైజాగ్‌లో కావాలంటే వైజాగ్‌లో ఇప్పించారు. ఇప్పుడు తను ఢిల్లీలో ట్రైనింగ్ పీరియడ్‌లో ఉన్నాడు. నా కోరికలన్నీ గురువుగారు తీర్చడంతో, ఆయన్ని దర్శించుకోవాలనే కోరిక కలిగింది. క్రితంసారి (జనవరి - 2000)లో షిరిడీ వెళ్ళినప్పుడు గురువుగార్ని యాంత్రికంగా దర్శనం చేస్కున్నాను. గురువుగారు వైజాగ్ వచ్చినప్పుడు (19 జనవరి, 2000) దర్శనానికి వెళ్ళలేకపోయాను. కాని ఆయన గురించి కొంచెం తెలుసుకొన్నాక ఆయన్ను దర్శించి, గురువు యొక్క ప్రత్యక్ష సన్నిధి యొక్క మాధుర్యాన్ని చవిచూడాలనిపించింది. గురుపౌర్ణమికి (సం॥2000) గురువుగారు ఈ కోరికను కూడా తీర్చారు.



యానాలో ఆయన ప్రత్యక్షసన్నిధిలోని ఆనందం మాటల్లో చెప్పనలవికాదు. అది ఇదీ అని చెప్పడానికి లేదు. వేరే ధ్యాస లేదు. బాబా నామం చెబుతూ, గురుసన్నిధిని అనుభవిస్తూ సమయం ఎలా గడిచిందో తెలియలేదు. కంటిలోంచి ఉబికివచ్చే నీళ్ళు ధారగా అడ్డుపడుతుంటే అవి తుడుచుకుంటూ "గురువుగారి దివ్యమంగళ రూపాన్ని" చూస్తూ ఉంటే, ఆయన సన్నిధి యొక్క ప్రభావం ఎంతటిదో తెలిసింది. గురుసన్నిధి ఎంతటిదో అనుభవంలోకి వచ్చింది. ఇది నా ఒక్క అనుభవం కాదు. ప్రతి భక్తుని అనుభవం. ఆయనే మన హృదయమంతా నిండిపోయి, హృదయమీటల్ని మీటుతున్నట్లుగా అన్పించింది. ఈ అనుభవం వర్ణనాతీతం. ఇది ఒక్కరోజు అనుభవం కాదు. అక్కడున్నన్ని రోజూలూ ఈ అనుభవాన్ని పొందాము.

మరునాడు బైట స్టేజి వేసి, అందర్నీ అక్కడ కూర్చోబెట్టారు. మేము స్టేజికి చాలా దగ్గరగా కూర్చొన్నాము. గురువుగార్ని దగ్గర్నుంచి చూడగల్గుతామనుకున్నాను. గురువుగారి సమక్షంలో ఆ రోజు రెండు పెళ్ళిళ్ళు. అక్షరాభ్యాసాలు జరుగుతాయన్నారు. కాబట్టి ఎక్కువసేపు గురువుగార్ని దగ్గర్నుంచి చూడొచ్చు అనుకున్నాను. ఈ లోగా శిరీష అను గురుబంధువు నన్ను నారాయణి అనే గురుబంధువుని అర్జంటుగా రండి మీతో పనుంది అని చెప్పింది. మేమిద్దరం అక్కడ్నుంచి లేచి బైటకు వెళ్ళాం. ఆ అమ్మాయి మీరిక్కడే నుంచోండి, నేనిపుడే వస్తాను అని చెప్పి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి ఎందుకు పిల్చిందో మాకు తెలియలేదు. స్టేజి ఎదురుగా కూర్చొన్నవాళ్ళకి అటూ ఇటూ చాలామంది గురుబంధువులు నిల్చొని ఉన్నారు. (కూర్చోడానికి ప్లేస్‌లేని వారు) వెనుకగా నేను, నారాయణి నిల్చొని శిరీష మనల్ని ఎందుకు పిల్చింది? అని అనుకుంటూ ఉన్నాం. ఈ లోగా యానాలోంచి గురువుగారు నడిచి వస్తున్నారు. మేము స్టేజికి యానాకి మధ్యలో నుంచున్నాము. గురువుగారు మా వైపుగా నడచిరావడం చూసి మాకు నోటమాట రాలేదు. భూమాత కందిపోతుందేమో అన్నట్లుగా ఆయన చాలా సుతారంగా నడుచుకుంటూ వచ్చారు.

ఆయనలా నడిచి వస్తుంటే ఏదో తెలియని అనుభూతిని పొందాను. గురువుగారు మా ప్రక్కగా నడిచివెళ్ళి స్టేజి ఎక్కారు. గురుబంధువులందరూ నామం చెబ్తూ గురువుగార్ని చూస్తూ తన్మయత్వంలో మునిగిపోయారు.

కాని నా పరిస్థితి వేరుగా ఉంది. నేను అందరికంటే వెనకాల ఉండిపోయాను. నాకు గురువుగారు కనిపించడం లేదు. అందరూ అడ్డం వస్తున్నారు. నాకు ఏడుపు వచ్చింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. దేవా! ఎందుకిలా చేసారు. స్టేజి కెదురుగా కూర్చుంటే అక్కడా కోర్చోనియ్యలేదు. ఇక్కడి నుండి మీరు కన్పించడం లేదు అని ఏడ్చేశాను. అప్పుడు నా ప్రమేయం లేకుండానే గురుబంధువులు నన్ను ఇంకొక ప్రక్కకి నెట్టారు. అక్కడి నుండి గురువుగారు బాగా కనిపించారు. నా ఆనందానికి అంతులేదు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇలా అడగ్గానే (మనసులో అనుకున్న వెంటనే) తీర్చడం. అంతే కాకుండా ఆయన స్టేజి మీద ఉన్నంతసేపు నాకేది అడ్డురాకుండా చేయడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించాయి. అంతేకాకుండా ఏం దూరాన ఉన్నానని బాధపడుతున్నావా? అన్నట్లుగా ఉంది గురువుగారి భావం. నీకు నేనున్నానని ఈ లీల ద్వారా గురువుగారు నాకు తెలిపారు. అసలు నేను 2,3 వరుసల తర్వాత నుంచున్నాను. అయినా ఎవరూ కూడా నాకు అడ్డురాలేదు. ఇంతసేపు ఎవరూ అడ్డం రాకుండా గురువుగారు ఏలా చేసారనేది నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. ఇదంతా "గురుకృపే"నని తెలుసుకున్నాను. ప్రత్యక్షంగా నేను "గురుకృప"ను ఆ రోజు చవిచూచాను. అందులోని మాధుర్యాన్ని గ్రహించగలిగాను. గురువుగారు ఆ రోజు చూచిన చూపు నేను ఎన్నటికి మర్చిపోలేను. అక్కడ 3 రోజులూ గురుసన్నిధిలో ఎంతో ఆనందాన్ని అనుభవించాము. గురుసన్నిధిలో బయటి ప్రపంచ ధ్యాసలేకుండా గడిపాము.

తర్వాత మేము షాపులు కట్టినప్పుడు, అద్దెకు ఇవ్వడానికి వీలుగా ఇల్లు కట్టినప్పుడు ఆర్థిక సమస్యలు వచ్చాయి. గురువుగారితో చెప్పుకున్న వెంటనే (ఉత్తరం వ్రాసిన వెంటనే) అవి పరిష్కారం అయినవి. ఆఖరికి ఆ షాపులు, ఫ్లాట్స్ ఖాళీగానే ఉన్నాయి కొన్నాళ్ళు ఏంటి దేవా! ఇది ఇలా ఎన్నాళ్ళు ఖాళీగా ఉంచుతారు అని అడగ్గానే వాటిలోకి అద్దెకు రప్పించారు.

ఆశ్చర్యమేమిటంటే, నేను రాసుకున్న ఇన్ని ఉత్తరాల్లోను చాలా మటుకు ఆయనకు చేరకుండానే (పోస్టు చెయ్యడం లేట్ అయినా కూడా) నాకు సమాధానం వచ్చేది. లెటర్స్ కాకుండా ఇంటి దగ్గర ఉన్న గురువుగారితో చెప్పుకున్నా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఇలా ప్రతి విషయంలోనూ, అడుగడుక్కి గురువుగారు మమ్మల్ని కాపాడుతూనే ఉన్నారు.

ఈ నా అనుభవాల ద్వారా ఆయన ఎంతటి శక్తిమంతులో నాకర్థమయ్యింది. గురువుగారి యొక్క సర్వజ్ఞత్వం తెలిసివచ్చింది. బాబా షిరిడీలోనే కూర్చొని కొన్ని వందలమైళ్ళలో జరిగే విషయాలన్నీ తెలుసుకొనేవారని చరిత ద్వారా విన్న నాకు, అది నిజంగా అనుభవంలోకి వచ్చింది. నేను చదివిన బాబా చరిత్రకు, నేను అనుభవిస్తున్న, వింటున్న గురులీలలకు భేదం లేదనిపిస్తోంది. "బాబా - ఆయన" ఒక్కరే అనిపిస్తోంది. గురుదేవులకు పాదాభివందనాలర్పిస్తూ, ఆయన ఆశీస్సులు మనమీద ఎప్పుడూ కుండపోతగా వర్షించాలని ఆశిస్తూ శలవు తీసుకుంటున్నాను.

ఉక్కునగరం, విశాఖ, 12-12-2001 గురుబంధువు, శారద.

## ఆర్తికి - ఆదరణ, భక్తితో - సమర్పణ

పూజ్య గురుదేవుల పాదములకు నమస్కరిస్తూ...

నా పేరు ప్రసాద్. నేను తెనాలిలో క్లాత్ షాప్‌లో వర్కు చేస్తుంటాను. నేను తరచూ గురూజీ ప్రతిష్టించిన దత్తసాయి ఆలయానికి వెళ్తూ వుంటాను. నేను మందిరానికి వెళ్ళినపుడు అక్కడ పేదలకు అన్నదానం జరుగుతుండటం చూస్తుండే వాడిని. నేను కూడా, నా శక్తి కొలది పేదలకు బాబా పరంగా భోజనాలు పెట్టించాలని ఆశపడ్డాను. నేను బాబా కోసమై దాచుకున్న డబ్బులు రూ.500 మాత్రమే వున్నాయి. మరురోజు ఆ 500 రూపాయలు తీసుకుని మందిరానికి వెళ్ళి విషయం చెప్పాను. ఆఫీసు వారు అన్నదాన నిమిత్తం రూ.1116 లు లోపు తీసుకోమన్నారు. నిరుత్సాహంగా బాబాకు నమస్కరించుకొని తిరిగి వచ్చేశాను. 2వ రోజు ఉగాది వచ్చినది. ఆ రోజు ఇంట్లో గురువుగారిని అడిగాను - నా కోరిక ఎలాగైనా తీర్చమని వేడుకున్నాను. నాకు శరణాగతి, ఆధారపడటం, వంటి పెద్ద మాటల గురించి తెలియకపోయినా, ప్రతి విషయం బాబాకి, గురూజీకి చెప్పుకొనే అలవాటు చేసుకున్నాను. రూ.500 లు తీసుకుని ఉగాది రోజున మరలా మందిరానికి వెళ్ళాను. అక్కడ ఆఫీసులోనే ఒక తెలిసిన మిత్రుడు కలిశాడు. అన్నదాన విషయం చెప్పాను. దాని నిమిత్తం ఐతే మాత్రం రూ.1116 లు తక్కువ తీసుకోము. కానీ మీరు చాలా ఆర్తితో భోజనాలు పెట్టాలనే సంకల్పముతో వున్నారు కాబట్టి మీ రూ. 500/- లతో శ్రీరామనవమిరోజున 50 మంది పేదలకు భోజనాలు పెట్టిస్తామన్నారు. మొదటకాదు అన్నవాళ్ళే గురూజీని వేడుకున్నాక సరేనన్నారు. నా సంకల్పం చిన్నదే కావచ్చు. ఆ నిముషంలో గురూజీ నాకిచ్చిన ఆనందం కొండంత. నా కోరిక నెరవేర్చినందుకు ఆనందంతో చెమర్చిన కళ్ళతో మనసులో బాబాకి, గురువుగారికి నమస్కరించుకున్నాను.

షరాఫ్ బజార్, తెనాలి 12-12-2001

గురుబంధువు ప్రసాద్

"మా సాంప్రదాయమే వేరు" అన్నారు శ్రీ సాయి, దేని నుండి వేరు? అన్న యోచన కానీ, సిసలైన సాయి సాంప్రదాయం ఏమిటి? అన్న జిజ్ఞాస గానీ నేటి వరకు వెలువడ్డ సాయి చరిత్రలలో అంతగా కన్పించని సత్యం! ఈ సందేహాన్ని వ్యక్తీకరించలేక గుండెల్లోనే గూడు కట్టుకొన్న అనేక వేల సాయి భక్తుల హృదయాంతరాళాల్లోని శేష ప్రశ్నలకు సమాధానం - శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ.

## గురువుగారే మా ఇంటి ఇలవేల్పు

ముందుగా సాయినాథునికి, శరత్‌బాబూజీ గారికి మనః పూర్వకంగా సాష్టాంగ నమస్కారములు తెలుపుకుంటున్నాను. నా పేరు సునీత. మేము వైజాగ్ ఉక్కునగరంలో ఉంటున్నాము. మా ఇంటికి ఎదురుగా శిరీష వాళ్ళు ఉంటున్నారు. శిరీష ద్వారానే నాకు గురువుగారి గురించి తెలిసింది. బాబా, గురువుగారి బుక్స్ చదివిన

వెంటనే నాలో నాకే మార్పు కన్పించింది. ఆ తరువాత నుంచి రెగ్యులర్‌గా సత్సంగంకి వెళ్ళడం జరిగింది. నేను శిరీష వాళ్ళు ఇంటి దగ్గర రోజూ సత్సంగం చేసుకుంటాము.

నేను మొదటిసారి షిరిడీకి జూన్, 2000లో మా అమ్మానాన్నలతో వెళ్ళాను. వెళ్ళిన రోజే మేము బాబా, గురువుగారి (స్టేజి) దర్శనం చేసుకున్నాము. మళ్ళీ తిరుగు ప్రయాణం రోజున గురువుగారి పాద (ఊదీ) దర్శనం చేసుకుని హైదరాబాద్ రావడానికి బస్ ఎక్కాము. మాకు బస్‌లో చివరి సీటులకి రిజర్వేషన్ దొరికింది. మేము సీటులో కూర్చునే ముందే, నాకు మనసులో ఏదో కీడు కల్గుతుందనిపించింది. మేము బాబా, గురువుగారిని స్మరించుకుని బయలుదేరాము. రాత్రిపూట భోజనాలకు 11 గంటల ప్రాంతంలో ఒక డాబాలో బస్ ఆపారు. అక్కడ డ్రైవర్ భోజన సమయంలో డ్రింక్ చేశాడు. మేము ఎలా తీసుకువెళతాడో అని అనుకున్నాము. బస్ బయలుదేరిన కాసేపటికి రోడ్డు పక్కనే ఉన్న సైకిల్‌ని గుద్ది అదుపుతప్పి రోడ్డు కిందకి వచ్చేసింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడం వల్ల చివరి సీట్సులో కూర్చున్న మాకు మామూలు దెబ్బలు తగిలాయి, కానీ మా అమ్మకు నడుము మీద వెనకాల రాడ్ గట్టిగా తగిలింది. అమ్మ అప్పటికే షాక్ అయింది. మేము వెంటనే గురువుగారు ఇచ్చిన ఊదీని అమ్మకు పెట్టి కాసేపు విశ్రాంతినిచ్చాము. అరగంట తరువాత (అమ్మ కొంచెం కుదుట పడిన తరువాత) బస్సు బయలుదేరింది. బయలుదేరిన అరగంటకే ఎదురుగా ఒక లారీని తప్పించబోయిన సమయంలో బస్ బ్రేక్స్ ఫెయిల్ అయి రోడ్డు కిందకి వచ్చి చాలా దూరం వరకు వెళ్ళి ఆగింది. ఆ సమయంలో బస్సు అద్దాలు పగిలి మాకు గుచ్చుకున్నాయి. మా అమ్మకి మళ్ళీ ముందు రాడ్ మీద నాలుగుసార్లు పడి చెస్ట్‌కి బాగా దెబ్బ తగిలింది. బస్ కుదుపులకు అమ్మ తలకు టావ్ తగిలి నోట మాట రాలేదు. శ్వాస కూడా సరిగ్గా లేదు. స్పృహ తప్పిపడిపోయింది. ఆ సమయంలో మాకు ఏమి చేయాలో తోచలేదు. నేను, నాన్న వెంటనే గురువుగారిని మనస్సులోనే స్మరించుకుని కొంచెం ఊదీని నోట్లో వేసాము. ఆ సమయంలో అమ్మ ఇక బ్రతకదని అనుకున్నాము. అమ్మకి ఊదీ పెట్టిన కాసేపటికే మేల్కొంది. అరగంటసేపు ఏమీ మాట్లాడలేదు. ఎవరినీ పోల్చుకోలేక పోయింది. బస్ బ్రేక్స్‌ని రిపేర్ చేసి నాందేడుకి వచ్చాక, అక్కడ హాస్పటల్‌లో అమ్మకు చూపించాము. రెండు గంటలు హాస్పటల్‌లో ఉంచి పంపారు. ఆ తరువాత పెట్లం దగ్గర బస్సు ఆపి గురువుగారికి ఫోన్ చేసాము. మెసేజ్ పంపాము.

నారా అంకుల్, సాయి వరప్రసాద్ అంకుల్ ఫోన్ రిసీవ్ చేసుకున్నారు. మేము గురువుగారికి విషయం తెలిపి, ఆశీర్వాదం తీసుకోమని వేడుకున్నాము. ఏమి భయం లేదని మాకు చెప్పారు. హైదరాబాద్‌కి వచ్చాక ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చూపిస్తే వాళ్ళు నిమ్స్‌కి వ్రాసారు. అక్కడ అమ్మకు 24 గంటలు పాటు అబ్జర్‌వేషన్‌లో ఉంచారు. మళ్ళీ మేము శిరిడీకి ఫోన్ చేసి చెప్పాము. మేము గట్టిగా గురువుగారిని ప్రార్థించుకున్నాము. మా మనస్సులో కూడా అమ్మకు ఏమీకాదు, గురువుగారు మనతో ఉన్నారనే నమ్మకంతోనే ఉన్నము. మరుసటిరోజు డాక్టర్స్ అందరూ అమ్మకు చెక్ చేసి ఏ సమస్య లేదు. నెలన్నర రోజులు రెస్ట్ తీసుకుంటే చాలని చెప్పి డిస్చార్జు చేసారు. మా అమ్మ మళ్ళీ మాకు కన్పిస్తుంది అంటే అది గురువుగారి వల్లనే. గురువుగారు మా అమ్మకు పునర్జన్మనిచ్చారు. ఇప్పుడు బాబా, గురువుగారే మా ఇంటి ఇలవేల్పులు.

వై. సునీత రెడ్డి, 110 సి. సెక్టార్-3, ఉక్కునగరం, విశాఖపట్నం.

## స్థాన వ్యత్యాసాలు - గురువుకుండవు

-హేమలత, తెనాలి

నా పేరు హేమలత. 99 సం॥ నవంబరు నెలలో ప్రభుత్వ ఉద్యోగం కోసం విశాఖపట్నం కోర్టులో ఖాళీలుంటే నేను అప్లికేషన్ పెట్టుకొనినాను. 2000 మే నెలలో 2 వ తారీకున నాకు ఇంటర్వ్యూ జరిగింది. ఆ తరువాత జనవరి 2001 న లోకలు వారికే ఆ ఉద్యోగాలిస్తామనే మాటలు విన్నాను. స్థానికులు కాని వారికి ఇవ్వరని నాకు బాగా తెలిసిన వారు చెప్పారు. నాకు ఈ విషయం తెలియక అప్పట్లో తెనాలిలో ఉంటున్న కారణంగా తెనాలి చిరునామాను ఇచ్చాము. తరువాత నేను ఎంతో బాధ పడ్డాను. వెంటనే 2001 జనవరి 16 వ తేదిన శిరిడీకి వెళ్ళాను. బాబాకు, గురువుగార్కి నా విషయాన్ని విన్న వించుకొనినాను. సాయినాథా నేను ఉద్యోగం కోసం అప్లికేషన్ పెట్టినాను. నాకు ఆ ఉద్యోగం మీ అనుగ్రహంతో వచ్చేలా ఆశీర్వదించండి. ఇప్పటిదాకా నేను, నా పిల్లలు నా తండ్రిమీద ఆధార పడ్డాము. నా పిల్లలను పోషించుకోవటానికైనా నాకీ ఉద్యోగాన్ని ఇప్పించగలరని ప్రార్థించాను. 18 వ తేదీన బయలుదేరి 19 వ తేదీకి తెనాలికి చేరాను. ఫిబ్రవరి నెల 7 వ తేదీ కల్లా నన్ను ఉద్యోగంలో చేరమని ఆర్డర్స్ ఇచ్చినారు. ఇది వారి అనుగ్రహమేనని నా భావన.

నేనా ఉద్యోగంలో చేరాను. ఇప్పుడు నేనెంతో ఆనందంగా ఉన్నాను. నా మీదెప్పుడు సాయినాథుని అనుగ్రహముండాలని ప్రార్థిస్తున్నాను.



## అడిగింది ఇచ్చుటే సాయి శపథం

శ్రీ పూజ్య సద్గురు దేవులు శ్రీ సచ్చిదానంద సర్వసమర్థ సద్గురు శ్రీ సాయినాథుని శరత్‌బాబా మహరాజ్ దివ్య పాద పద్మములకు అనేకానేక షాష్టాంగ నమస్కారములు చేసుకుంటూ, శ్రీ గురుదేవులు చేసిన అద్భుత లీలను గురుబంధువులకు తెలుపుకుంటున్నాను.


నా కుమారుడు రామచందర్‌కు ఆరోగ్యము సరిగా ఉండుటలేదు. అతనికి వాతావరణము మారినపుడు ఆయాసము వస్తుంది. మందులు ప్రతిరోజు వాడవలసివచ్చేది. ఏ రోజు మందులు వాడక పోయినా ఆ రోజు ఆయాసము వచ్చేది. బాబు చిన్న వయస్సు నుంచి నానా కష్టాలు పడ్తున్నాడు. నేను బాబా గారి మహిమలు గురించి విని, క్రిందటి సంవత్సరము జనవరి నుంచి బాబా గారిని పూజించుకొనుచున్నాను. బాబా గారి సత్సంగాలకు విధిగా, భక్తితో హాజరయి, బాబాగారి ఆశీస్సులు పొందుచున్నాను. నేను అనుకోకుండా గురుపూర్ణిమకు షిరిడీ వెళ్ళాను. నేను షిరిడీ వెళ్తానని కలలో కూడా అనుకోలేదు. నేను ఆయన ఆశీస్సులు ఉండటమువలనే షిరిడీ వెళ్ళాననిపించింది. నేను మొదటిసారి షిరిడిలో సాయినాథునిశరత్ బాబూజీ గారి దర్శనము చేసుకున్నాను. నాకు ఆయనను చూడగానే కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చినవి. నా కష్టములను తీర్చేదేవుడుగా కన్పించినారు. నేను మొదటిసారి గురువుగారిని దర్శనము చేసుకొని నా కుమారుని ఆరోగ్యము గురించి చెప్పుకున్నాను. ఆయన ఆశీస్సుల వలన, నేను

షిరిడీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత, నా కుమారుని ఆరోగ్యములో చక్కని మార్పు కనపడినది. వాతావరణము మారినా, నా కుమారుని ఆరోగ్యము చక్కగా ఉంది. అప్పటి నుంచి ఏ మందులు వాడలేదు. యిది అంతయు శరత్ బాబూజీ గారి ఆశీర్వచనములే మందులుగా పనిచేసి, నా కుమారుని ఆరోగ్యము కాపాడినది. గురువుగారికి, బాబాగారికి అనేక నమస్కారములు. యింత చల్లని దయగల దైవము మన మధ్య ఉన్నందుకు నాకు ఎన్తో ఆనందముగా ఉన్నది. బాబా గార్కి నమస్కారములతో...

ఎం.వి.పి.కాలనీ, విశాఖ 12-12-2001 గురుబందువు - వై.జయశ్రీ

వివిధ విషయ వాసనలతో కోరికలతో, ప్రాపంచిక వ్యామోహాలతో సతమతమవుతున్న మనలను మనస్సు యొక్క సహజ ధర్మాల కనుగుణంగా సంస్కరించి, ఉద్ధరించి, సద్గతిని అందచేయడమే - సాయి అవతార కార్యం యొక్క పరమార్థం -- శ్రీ బాబూజీ

## కంటిని కాపాడు రెప్పలా! తండ్రిలా బిడ్డను రక్షించు గురునిలా...



'గురుకృప' ద్వారా గురుబందువులకు "గురుకృప" ను తెలియజేసుకుంటున్నాను.

నాపేరు మణిమాల మేము విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లో వుంటున్నాము. ఇక్కడ ప్రతి శనివారం 4 గంటలకు సత్సంగం జరుగుతుంది. మేము సత్సంగానికి వెళ్ళిన తరువాత వచ్చిన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. మా తమ్ముని భార్యకి మూడవ నెల వచ్చింది. కాని ఆమెకు బాగా రక్తస్రావం అవడంతో భయం వేసింది. కనీసం 15 రోజుల వరకు తగ్గలేదు. నాకు ఫోన్ చేసి తమ్ముడు చెప్పగానే చాలా బాధ వేసింది. విశాఖపట్నం తీసుకువచ్చి డాక్టర్‌కి చూపిస్తామన్నారు. ఆమె లేవలేని పరిస్థితి, ఆ పరిస్థితులలో ఎవ్వరివద్దా డబ్బులు కూడా లేవు. చాలా కష్టమైనది. డబ్బులేనిదే ఏ పని జరుగదు. ఆ సమయంలో నాకు కలిగిన వేదన అంతా ఇంతా కాదు. అప్పుడు నేను మనసులో గురువుగారిని తలచుకుని ఊదీ నా నోట్లో వేసుకొని, గురువుగారు - ఈ సమయంలో నా మరదలు ఊది వేసుకోవాలంటే ఆమె వద్ద ఊదీ లేదు. నేను పంపిద్దామంటే టైం లేదు, మరియు చాలా దూరం. నేను ఊదీ వేసుకుంటే ఆమె వేసుకున్నట్లుగా భావించి మీరు ఆమెకు రక్తస్రావం తగ్గించాలి. ఈ రాత్రికే తగ్గాలి అని, ఆ పని కోసం వైజాగ్ రాకూడదు అని అనుకున్నాను. మరునాడు వాళ్ళు వస్తారేమో అనుకున్నాను. కాని రాలేదు. తరువాత నేను పనిమీద ఊరువెళ్ళితే మా మరదలకి తగ్గిపోయిందని తెలిసింది. నేను గురువుగారితో చెప్పుకున్న రాత్రే తగ్గింది. ఆ సమయంలో గురువుగారికి మనఃస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెల్పుకున్నాను. మేము గురువుగార్ని నమ్ముకున్న తరువాత నాకు తెలిసిన దేమిటంటే ఆయన బిడ్డల్ని ఎప్పటికీ పతనం కానివ్వరు. ఎన్నటికి కష్టపెట్టరు. ఆయన బిడ్డల్ని ఎక్కడున్నా కంటికి రెప్పలా కాపాడుతారని అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలి? గురువుగారి ఆశీస్సులు సదా అందరికీ వుండాలని, మనఃస్ఫూర్తిగా కోరుకుంటూ...

ఉక్కునగరం, విశాఖపట్నం గురుభందువు - వి.మణిమాల

కాశీలో నివసించి, నిర్మల గంగాజలం పానం చేయవచ్చు. కాని గురునామస్మరణ లేకుండా విముక్తి దొరకదు - కబీరు

ఆధ్యాత్మికత అనే కుసుమం ముకుళితమయినప్పుడు "సద్గురువనే" తోటమాలి అవసరం

## ఆ క్షణాన... ఆ రెండక్షరాలే మృత్యుంజయ మంత్రమై రక్షించే

ఆ రోజు చాలా మంచిరోజు. మంచిరోజు, చెడు రోజు అనే విచక్షణని గురువుగారు అంగీకరించరు. అన్ని రోజులు ఒకటే అనేది వారి బోధ. అలా కాకపోయినా విషాదానికి బదులుగా - సంతోషాన్ని యిచ్చినరోజు.

ది. 4-8-2001 శిరిడి చేరిన రోజు. ఆ రోజు తెలిసిన శుభవార్త. రేపు 2 జీపులలో అమ్మగారు, శిరిడీలో గురుబంధువులు అందరు దగ్గరలోని పుణేతాంబే క్షేత్రం చూడటానికి బయలు దేరుతున్నట్లు నాకు కూడా వెళ్ళే అవకాశం కలిగింది. ది. 5-8-2001 ఆదివారం ఉదయం 8 గంllలకు వెళ్ళి మరల సాయంత్రం 5 గంll తిరిగి వచ్చేటట్లుగా, తినుబండారాలు వగైరా ఏర్పాట్లతో బయలు దేరినాము.

ఏ ప్రదేశమునకు వెళ్ళుచున్నామో, దాని స్థల విశేషములు అందరికి పూర్తిగా తెలియదు కాబట్టి, లోగడ సాయి పథం పత్రికలో "ఆవో చాంగ్‌దేవ్ మహరాజ్" అనే ఆర్టికల్ "గంగగీర్ మహరాజ్ చరిత్ర" ఆర్టికల్స్ వున్న పుస్తకములు అమ్మగారిని అడిగి తీసుకొని, పెద్దవారందరు ఒక జీపు, చిన్న వారందరు ఒక జీపులో బాబాకు, గురూజీకి నమస్కరించుకొని బయలు దేరినాము. మొదటి జీపులోని పెద్దవారందరు నామం చెబుతుండగా, చిన్న వారి జీపులోని మేమందరము ఎక్కువ మంది పిల్లలు వున్నందున "అంత్యాక్షరి" తెలుగు, హిందీలలో చెప్పుకుంటూ సరదాగా పుణేతాంబే చేరటం జరిగింది. వెళ్ళగానే ఫస్ట్ రౌండ్‌గా టిఫిన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని, అచ్చట నుండి చాంగ్‌దేవ్ మహరాజ్ సమాధిని ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి నది దగ్గరకు బయలు దేరినాము. ఇచ్చటి గోదావరిని ఉత్తరముఖ గోదావరి అని పిలుస్తారని తెలిసింది. మేము బయలు దేరుతున్నప్పుడే గోదావరిలో స్నానం చేసే ఉద్దేశ్యముతో అందుకు కావలసిన ఏర్పాట్లతో వెళ్ళాము. కాని వెళుతున్నది నదికి అని తెలియక అందరూ తెచ్చుకొన్న బట్టలు జీపులోనే వున్నవి. మరల అంత దూరం వెనుకకు రాలేక అందరూ అలాగే నది స్నానం, (జలకాలాటలతో సరదాగా) కేరింతలతో వసంతోత్సవంలాగా ఆడవారు అందరు చిన్నసైజు జలాశయంలో దిగి సమయాన్ని మరిచారు. నేను, భాను, రవి, శివ, కుమార్ 5 గురం కలసి యింకొంచెం ముందుకు వెళ్ళటం జరిగినది.

నేను అప్పటి వరకు చూచిన నదీ తీరాల కంటే భిన్నముగా వున్నది ఈ ప్రదేశం. కొద్ది దూరంలో రైల్వే ట్రాక్ ఎత్తుపల్లాలతో కూడిన కొండరాతి ప్రదేశము నడుమ, మధ్యల నుండి ప్రవహించే గోదావరి నది అందాలను ఆస్వాదిస్తూ అందరం కలసి బాగా నీరు వున్న ప్రాంతానికి వచ్చాము. మరి నేను కూడా స్నానం చేయాలి ఎలా? తీసుకొని వెళ్ళిన తుండుగుడ్డా, లుంగీ జీపులోనే వున్నవి తరుణోపాయంగా బన్నీ వున్నది కదా అని, భాను వాళ్ళ మధ్య మార్చుకోలేక కొద్ది మరుగుగా వున్న కొండ వెనక్కి వెళ్ళి డ్రస్సు మార్చుకొన్నాను. కాని అలా వాళ్ళ దగ్గరికి


వెళ్ళటానికి కొంచెము (పూర్తిగా) సిగ్గు వేసి, ఆ దగ్గరలో స్నానం చేద్దామని వెతుకుతూ, నాకు అవకాశం వున్న చోట నీటిలో దిగటం జరిగినది. ఇది నేను చేసిన మొదటి ఘనకార్యం.

నేను స్నానానికి దిగిన చోటు "U" ఆకారంలో ఉన్నది. అచ్చటికి రైల్వే ట్రాక్ సుమారు ఒక ఫర్లాంగ్ దూరం వుంటుంది. నేను దిగిన చోట ఏవో మార్పులు చేర్పులు జరిగి, పెద్ద దిమ్మ (ఆర్.సి.సి.పిల్లర్) సుమారు రెండు చదరపు అడుగులు వుంటుంది. దానికి నాలుగు ప్రక్కల లావు బోల్ట్స్ వున్నవి. నేను దానికి క్రిందగా షుమారు ఛాతి సగం వరకు నీళ్ళు వున్నంత లోతులో స్నానానికి దిగాను. ప్యాంట్, షర్టు, చెప్పులు కొంచెము దూరంలో వదిలి వచ్చాను. విశ్వామిత్రుడంతటి తపస్వికే మనస్సును జయించటం కుదరలేదు. ఇక నేను ఎంత. నేను దిగిన చోటు నుండి కొద్దిగా ముందుకి కొండరాళ్ళ మీద నడిచినాను బాగానే వున్నది. ఈ అంచున కొండని పట్టుకొని నడుస్తూ భాను వాళ్ళ దగ్గరికి వెళ్ళి వాళ్ళని సర్‌ప్రయిజ్ చేద్దామన్న ఆలోచనతో మెల్లగా కొద్ది కొద్దిగ నడుస్తూ ఒక నాలుగు అడుగులు కూడా వేసానో లేదో మృత్యుదేవత నా కోసం కాచుకొని వున్నది. నాకు ఈత రాదు. లోతు చాలా వున్నది అని తెలుసుకొన్నాను. మా ఇద్దరి మధ్య పోరాటం మొదలైంది. ఆలోచన శూన్యం అవుతుంది. జరగరాని పొరపాటు జరిగిపోయినది ఎలా! కాలు జారింది ప్రారబ్ధం దగ్గరికి వచ్చింది. పోరాటం బిగిన్ అయినది. (దీనికి ముందు కొంత నా పూర్వపు మానసిక సంఘర్షణ పాఠకులకు తెలపాలి) ఎన్నోసార్లు అనేక యిబ్బందులలో బి.పి, షుగరు, హార్టు ఎటాక్, ఏమైనా వచ్చి మామూలుగా సడన్‌గా మృత్యువు వస్తే ఎంత బాగుంటుంది అని చాలా సార్లు ఎదురు చూడటం, ఆత్మహత్య పిరికి వాళ్ళ పని అని ఎన్నోసార్లు మదన పడిన క్షణాలు గత 3 సం॥లలో ఎన్నో లెక్కలేదు. సరే అది అంతా ఒక కథ. మరి ఈ రోజు మృత్యుదేవత సర్వాంగ సుందరంగా అలంకరించుకొని తన ఒడిలోకి తీసుకొనటానికి వచ్చిందే. మరి మనస్సు ఊరుకుంటుందా! దాని ప్రయత్నం, చేయి జారిపోవటం, మరల ప్రయత్నం ఏమీ లాభం లేదు. మరణమే శరణ్యం. ఇది అక్షరాలనిజం. ఆ నీటిలో ఒక ప్రయత్నం, మరల ఆలోచన ఇలా ఎన్నో సార్లు, చావాలి అనుకొన్నాను కదా! మరి ప్రయత్నం ఎందుకు? నాకే తెలియదు, నీటి ప్రవాహం లేదు. నిలకడగల నీటి గుంట, మెదడు పని మెదడు చేస్తూనే వున్నది. చావు తప్పదు. సరే చస్తాను. కాని నా సంగతి బైట వారికి ఎలా తెలుస్తుంది. చుట్టు ప్రక్కల జన సంచారం లేదు. నాకు దూరంగా వాళ్ళు నలుగురు, నేను ఇటు వైపుకు వచ్చినది కూడా వాళ్ళకి తెలియదు కదా! ప్యాంటు, షర్టు, చెప్పులు వున్నవి కదా! మరి అవి ఎవ్వరైనా దొంగిలిస్తే వాళ్ళకి తెలియటానికి చాలా సమయం పట్టవచ్చును. శవం దొరకదు. నీటి అడుగున వుంటుంది ఎలా, చేతులు కాళ్ళు మాత్రం వాటి ప్రయత్నం అవి చేస్తూనే వున్నవి. చుట్టూ ఎవ్వరూ లేరుకదా. మరి నన్ను రక్షించే వారు ఎవ్వరూ లేరా? ఎందుకు లేరు. ఒక ఫ్లాష్ (మెరుపు) "బాబా" వున్నారు కదా! అంతే అప్పటి దాకా నోరుతెరువని నేను 'బాబా' అని కేక నీరు మింగడం ఒకేసారి జరిగింది. అదే నాపాలిట మృత్యుంజయ మంత్రం. రెండే రెండు అక్షరాలు, ఈ సంగతి గురువుగారు ఎప్పుడో వ్రాసారు. ఈ రోజు నిరూపించారు. "నేను ఎవ్వరికి ఏమీ బోధించను, నేర్చుకునేలా చేస్తాను - గురూజీ"

ఈ ప్రయత్నం ఇలా సాగుతుండగానే గుంజులాటలో నేను భాను వాళ్ళ వైపు కాక రెండో వైపుకు అంటే బయలుదేరిన చోటికి చేర్చబడ్డాను. అంటే "బాబా" అనే రెండు అక్షరాలు అన్న మరుక్షణం చేతికి ఒక ఆధారంగా ఒక ఇనప బోల్టు తగలటం మరల దాని కోసం ప్రయత్నించగా నీటిలో మునిగి ఉన్నా కనబడని యింకొక పిల్లరు నా చేతికి తగలటం, దాని బోల్టు పట్టుకొని పైకి రావడం అంతా క్షణంలో జరిగిపోయింది. వెంటనే దాని మీద

కూర్చున్నాను. కూర్చుంటే నాకు మెడ వరకు నీళ్ళు వచ్చినవి. ఇక ఊహించండి - మంత్ర రహస్యం. ప్రశాంత వదనంతో చుట్టూ ఒకసారి చూచి కొద్ది సేపు అలానే కూర్చుని, ఒళ్ళు అంతా తోముకొని స్నానం చేసి నేను ముందర చెప్పిన స్తంభం పైకి వచ్చాను. ఈ రోజు నాకే కాదు సుదినం. నాతో వచ్చిన గురుబంధువులందరికి ముఖ్యముగా తోరత్‌గారికి, ఎందుకంటే జరిగిన తరువాత అందరూ మామూలుగా అనేదే మీరు ఏమి చేస్తున్నారు. అందరు ఒక చోట వుండక్కర్లేదా అదేమిటి? ఇదేమిటి? అని సలహాలు ఇచ్చేవారు ఎక్కువ.

5-8-2001 నుండి బాబా, గురూజీ నాకు ప్రసాదించిన మరియొక జన్మ ఇది, లేక పోతే ఈ రోజు అనగా 5-9-2001 ఈ అనుభవం వ్రాస్తున్న నాకు నెల మాసికం - కాక మరి ఏమిటి?



బైట పడ్డ నేను డ్రస్సు మార్చుకొని నిదానంగా క్రొత్త ప్రపంచాన్ని పాత శరీరంతో చూస్తూ భాను వాళ్ళు స్నానం చేస్తున్న దగ్గరికి వచ్చాను. కాని అక్కడ ఒక్క కుమార్ మాత్రమే స్నానం చేస్తున్నాడు. ఇతరులు ఎవ్వరు చేయటం లేదు. శివని దిగమని గొడవ చేస్తున్నారు. అతను చాలా రోజులుగా భోజనం సరిగా చేయడం లేదు. ఈత కొట్టగలనో లేదో అంటూనే పైనించి దూకినాడు. అపుడు నేను వాళ్ళకి పూర్తి విషయం చెప్పకుండా చాలా లోతుగా వుంది, ప్రమాదం జాగ్రత్త - అని హెచ్చరించి, వాళ్ళు తొందరగా బైటకి రావాలని మనస్సులో కోరుకున్నాను. భానుకు మాత్రం కాలు జారినట్లు, గోళ్ళు అన్ని రాసుకొని గీతలు పడినట్లు చూపించి నాను. ఇదే చోట నేను దిగివుంటే ఇది వ్రాసే పనేలేదు. మిగిలిన అందరూ ఎంతో ఉత్సాహంగా నీళ్ళలో ఆడుకుంటూ వుంటే నా విషాద సంఘటన ఎవ్వరికి చెప్ప బుద్ధి కాలేదు. మరల అందరము దిగువ నుండి పైకి వచ్చి డ్రస్సులు అవి మార్చుకొని, అక్కడ చూడవలసిన ప్రదేశములు చూచి, చాంగ్‌దేవ్ మహరాజ్ సమాధి వద్ద కూర్చొని వెంట తెచ్చుకొన్న "ఆవో చాంగ్‌దేవ్ మహరాజ్" అనే ఆర్టికల్ శ్రీమతి కృష్ణవేణిగారు చదవగా అందరూ విని ఆనందించినారు. సమాధి వద్ద వున్న పూజారి మేము తెలుగు చదవటం విని మరల తనకి తెలిసిన మరాఠి చరిత్ర చెప్పగా దానిని హిందిలోకి మార్చి తోరత్‌గారు విశదీకరించి చెప్పినారు. ఆ పూజారి గారు మమ్మల్ని అందరిని తీసుకొని వెళ్ళి ఆయన వద్ద గల పేపరు కటింగ్స్ అన్ని చూపించినాడు. వాళ్ళ పూర్వీకులు సేకరించిన పురాతనమైన వ్రాత ప్రతులను కూడా చూపించటం, చాలా ఆనందం కలిగింది. ఆ పూజారిగార్కి లోగడ తెలుగులో ప్రచురించిన పుస్తకములు ఒకరు యిచ్చినారట. అవి మీకు యిస్తాను వుండండి అని ఇంటిలోనికి వెళ్ళి 2 పుస్తకులు అమ్మగారికి ఇచ్చినారు. (నేను ఆ పుస్తములు అమ్మగారి వద్దనుండి తీసుకొని చదవడం జరిగింది. అంత సంతృప్తిగా లేదు). అన్నీ చూచుకొని బైటకి వచ్చేప్పటికి సుమారు 2.30 - 3.00 గంII అయినది. మరల అందరము కలసి తెచ్చుకొన్న వివిధ రకములతో భోజనములు పూర్తి చేసుకొని కొంత విశ్రాంతి తరువాత షిరిడీ చేరినాము.

ఆ రోజు రాత్రి 7 గంIIల సత్సంగము తరువాత నేను ఒక సంఘటన చెబుతాను అన్నాను. ప్రయాణబడలికతోనో, పిల్లల వలనో అందరూ రాలేదు. అమ్మగారు మదిరంకు వెళ్ళినారు. రేపు చెబుతాను అన్నాను. కాని సుబ్రమణ్యం అంకుల్ మాత్రం వదలక చెప్పమంటే ఉద్వేగంతో జరిగిన సంగతి చెప్పినాను. అందరూ ఆశ్చర్యపోవటమే! ఇదే గనుక ఇతరులు వ్రాస్తే, అనుమానించేవాళ్ళలో నేను మొదటి వాడిని (గురువుగారి దగ్గరికి రాక ముందు) ఎందుకంటే ప్రతిది హేతువుతోకాని నమ్మనివాడిని. వినాయకుడు పాలు త్రాగాడు అని అందరు


అంటే, కాదు అని ప్రయత్నం చేసి విలేకరిని పిలిచి నిజముకాదు అని చూపించి. ఈ న్యూస్ రేపు మొదటి పేజీలో హెడ్‌లైన్‌లో వార్త అవుతుంది అని చెప్పినాను. ఆ వార్త ద్వారా నా పేరు కూడా పేపర్లో అచ్చుఅయింది.

ఎంతో కాలంగా బాబాని, గురువుగారిని నమ్ముకున్న నా తోటి గురుబంధువులు నిరుత్సాహంలో ఏమిటయ్యా మాకు చేసింది ఇన్ని సంవత్సరముల నుండి నమ్ముకుంటే పైసా లాభంలేదు. కష్టాలు పెరగటం తప్ప అంటుంటారు. నన్ను కూడా చాలా మంది క్రొత్తవాళ్ళు అడుగుతుంటారు. మీరు బాబా దగ్గరకి, గురువుగారి దగ్గరికి వెళ్ళిన తరువాత మీ ఆర్థికపరిస్థితిలో మార్పు వచ్చిందా? అని, కాని నేను వాళ్ళకి చెప్పేదొక్కటే. "నేను ఇవ్వదలచింది వాళ్ళు అడిగేంత వరకు" అన్న దానిమీద ఆధారపడ్డాను. ఎవ్వర్కైనా ఆయన ఇవ్వదలచినది డబ్బు మాత్రమే కాదు. మనకు తెలియని ఇలాంటి చర్యలు (రక్షణలు) ఎన్నో వుంటాయి. నేను అనే ఈ శరీరం ద్వారా గురూజీ నాకు అప్పచెప్పదలచిన పని ఏమిటో... వేచి చూడవలసినదే అన్నదే నా ధృడ విశ్వాసం. అందుకే నన్ను బ్రతికించారు.

- గట్టా రత్తయ్య, తెనాలి

ఆ చేయి ఎంతహాయి... భాగం -15

## రానంతవరకు రాయి వచ్చిన వెంటనే వజ్రంగా మారు



గురుదేవుల అనుగ్రహానికి ఈనాడెందరో పాత్రులైనారు. గురువుగారికి సన్నిహితంగా అంటే గురుసేవను, గురువచనాన్ని, గురుకార్య నిర్వహణ చేయువారు, అలాంటి వారెందరో ఉన్నారు. అటువంటి వారిలో నల్గురిని ఉదాహరణగా తీసికోవటం జరగబోతున్నది. వారి విధానాలను స్థాలీపులాకన్యాయంగా పరిశీలన చేద్దాము. వారి పూర్వపు పద్ధతులు, వ్యవహారాదులను పరిగణలోనికి తీసికొని "గురుచరణ సన్నిధికి" వచ్చిన తరువాత వైఖరులను తులనాత్మకపు ధోరణిలో తెలుసుకుందాము.

అస్తవ్యస్తమైన నడవడికను సరిదిద్ది సక్రమమైన సరళిలో పయనింప చేయటమన్నది సద్గురుని కృపావిశేషం వలననే జరుగుతుంది. అందరిని ఉదాహరించవలసి వస్తే ఇదే పెద్ద జీవిత చరిత్ర అవుతుంది. అందుకనే మన ధ్యేయానికి అనువైన సంఘటనలను, సన్నివేశములను తదనుగుణమైన వ్యక్తులను గ్రహించడమైనది.


"గురుదేవుల చరణ సన్నిధికి రాక మునుపు ఒక గురుబంధువు"

నెల్లూరు నగరమందు విద్యాభాసం చేస్తున్న రోజులలో కళాశాల స్థాయిలో వీరు ఆడింది ఆట, పాడింది పాటగా చెలామణైనారు. తరగతి గదిలో గోల చేయటమన్నది మామూలే. చదువులో వెనుకబడినట్లనిపించినా! తెలివి తేటలు అమోఘం. అల్లరి, ఆగడాలతో చెలాయించినా ఉత్తీర్ణులై ఉన్నత విద్యాభ్యాసానికి తిరుపతికి చేరారు. చదువెంతగా పెరిగిందో దానికి తగిన స్థాయిలోనే పూర్వపు పోకడలను విశ్వవిద్యాలయంలోను ప్రదర్శించక తప్పలేదు. చతుర్ముఖ పారాయణంలో ఎంతో ప్రావీణ్యతను సంపాదించి ఎందరో పేద విద్యార్థులకు ఆర్థికంగా

ఆదుకొన్నారు! మెస్ ఫీజులు ఇత్యాదులు చెల్లించేవారు. విశ్వ విద్యాలయంలో వారి విభాగానికి విద్యార్థుల తరపునాయకునిగా మరి కొన్ని విషయాలను ముచ్చటించుకోవాలి. సినిమా హాలుకు ఫోనుచేసి మా హాస్టల్ నుండి ఇంతమందిమి వస్తున్నామని చెప్పి టిక్కెట్లు ఉంచండని మేనేజరుకు చెప్పితే, గౌరవలాంఛనాలతో ఏర్పాట్లు జరిగేవి. అలా ఇవ్వని సందర్భాల్లో ఒక పర్యాయం ఏమైందో వారు చెబితే నాకు ఆశ్చర్యం కల్గింది.

అదుపు ఆపులు లేని స్వేచ్ఛ వారిని వరించింది. లాకెత్తేసిన దాము నుండి ప్రవహించే నదిలా సాగింది కొంతకాలం. ఎన్నో విషయాల్లో విజయ పరంపరలు చవిచూసి నప్పటికి డిగ్రీ తీసుకొనే విషయంలో కొద్ది తక్కువగా గజనీ మహమ్మద్‌కు వారసుడనిపించారు.

ఉన్నత విద్య పూర్తియైన తరువాత ఉద్యోగములో స్థిరపడినారు. నెలకు 10,000/- రూ॥ అదనముగా ఆదాయము వచ్చే ఉద్యోగమది. జీతంకంటే హెచ్చు అన్నమాట. వారు నోరు తెరచి అడిగితే బడాబడా కాంట్రాక్టర్లు సైతం నోరుమూసికొని చేతులు జోడించి గడగడలాడుతు వేలకు వేల రూపాయలు సమర్పించే వారు. మందుసీసాలు సమర్పించేవారు. శ్వేత కాష్టాలు తగలేసేవారు. తెల్లగుజ్జాలను తాగేసేవారు. లంచాలు గుంజేవారు. ఇవన్నీ చెప్పినప్పుడు నాకెందుకో ఇందులో అతిశయోక్తి ఉందనిపించి, నాకు తెలిసిన సన్నిహిత మిత్రులతో వారి విషయం వాకబు చేయగా! వారి నుండి మరెన్నో వింత వింత విషయాలు విన్నాను. అసలాయన 2% శాతమే చెప్పితే నేను వినవలసింది 90% శాతముందనిపించింది.



ఈ నాటికి గూడా నేను ఆయన్ను చూచినప్పుడు పూర్వపు విషయాలు స్ఫురణకు వచ్చినపుడు ఆ వ్యక్తి ఈ వ్యక్తీ! "ఆయనే - ఈయనా" అని అనుకుంటా? గతమందు వారితో పరిచయమున్న సాటి ఉద్యోగస్తులు ఈనాడు వారిని చూస్తే ఆశ్చర్యచకితులై, ముక్కున వేలు వేసికొనినారు. అందుకు కారణం ఆయనలోని పరిణితి. బాబా పట్ల, గురువుగారి పట్ల అంకితభావం, సేవాభావం, కర్తవ్య దీక్షత, దృఢ సంకల్పము, సడలని విశ్వాసము, నేతృత్వము, చీవాట్లు పెట్టడము, చురకలంటించటము, ఇలాంటివెన్నో ఉన్నాయి. ఇంకా పూర్వపు విషయం తెలిసికొనిన నేను వీరిలో ఇంతటి మార్పు ఎలా సాధ్యపడింది. ఇది సంభవమేనా? అని శంక నొందిన నాకు సాధ్యమే సుమా! గురు అండనుండ పరిణితి చెందక ఎట్లుండు అను సమాధాన మొచ్చింది. ఈ గొప్ప తనము ఆ వ్యక్తిదిగాదు. ఆదరించి అక్కున చేర్చుకొనిన గురు మహనీయుని చేతి చలువ అందుకే "ఆ చేయి ఎంత హాయి" అన్పించింది.

ఆసక్తికరమైన మిగిలిన అంశాల కోసం ఉగాది సంచికకై వేచి ఉండవలసినదే..

సమర్పణ: డా॥ ఎన్. సాయివరప్రసాదరావు, రీడర్ : రేపల్లె



# ఆనందదాయి అభయప్రదాయి

భక్తజన హృదయాబ్జభృంగమై - దిగివచ్చె దయతోడ దైవమే!
సాయిగా శ్రీ శిరిడి సాయిగా - ఆనందదాయిగా అభయప్రదాయిగా!
॥భక్తజన॥



చూపు తాకిన చోట చొక్కముగా నీవే -
చూపించు నీ రూపు నిక్కముగ మాకు
చూపుదాపుల హేల నీ దివ్యలీల!
చూపులోని చూపు చూపించు మాకు ॥భక్తజన॥

మనసు మబ్బుల మాటు మురిపించు నీ మోము
మమత జల్లుల వెనుక సమతగా వెలుగు
మమత సమతల హేల నీ దివ్యలీల
మమత సమతల మర్మమెరిగించు మాకు ॥భక్తజన॥

ఎరుకతో నిదురించు నీ ఎదన మాకు
మఱపు లేని నిదుర దయసేయి మాకు
ఎఱుక  మఱపుల హేల నీ దివ్యలీల
ఎఱుకలోని ఎఱుక ఎరిగించు మాకు ॥భక్తజన॥

--శ్రీ బాబూజీ